కయ్యా – కాలవ

'కరుణకుమార'

౧

లక్ష్మమ్మ గొప్ప అదృష్టజాతకురాలు. పాకనాటి కాపుకులంలో పుట్టింది. మళ్లా అపరమహాలక్ష్మే. ఇంతకీ పూర్వజన్మంలో ఇంత పెట్టిపుట్టిందేమో, ఈజన్మంలో భోగం అనుభవిస్తోంది.

లక్ష్మమ్మ పుట్టింటివారిది చాలా గట్టి సంసారం. మొగపిల్లకాయలు లేనందువల్ల లక్ష్మమ్మకూ ఆవిడ అక్కకూ — ఇద్దరుకూతుళ్లకూ ఒక ఊళ్లోనే మనువులు కుదిర్చి అక్కచెల్లెండ్లిద్దరూ ఒకచోటే సంసారాలు చేసుకుంటూఉంటారని ఆశపడి తండ్రి యిద్దరికీ చెరిముప్ఫయివేల రూపాయల ఆస్తీ యిచ్చి మహావైభవంతో వివాహాలుచేసి, వాళ్లను కాపరానికి పంపేడు. కాని కాపరానికివెళ్లిన మరుసటిసంవత్సరమే లక్ష్మమ్మభర్త కాలం చేసినందువల్ల, అప్పటినుంచి ఇప్పటివరకూ ఈముప్ఫయి ఏళ్లుగా ఆవిడ నిరంకుశమైన వైధవ్యాన్ని అవిచ్ఛిన్నంగా పరిపాలిస్తోంది. ఇదొక్కటే ఆవిడకు కొరతపెట్టాడు పాపం భగవంతుడు. ఇదమినహా ఆవిడ సంసారానికి ఏమీ కొరతలేదు.

అటు పుట్టింటివారివల్ల దఖలుపడ్డ ముప్ఫయివేల రూపాయల ఆస్తీ, యిటు అత్తింటివారివల్ల లభ్యపడ్డ ఏభైవేల రూపాయల ఆస్తీ కలిసి, భర్త చనిపోయేటప్పటికి ఎంత లేదన్నా ఓ ౮౦, ౯౦ వేల రూపాయల ఆస్తికి లక్ష్మమ్మ హక్కుదా రయింది. చావు మంచంమీద ఇంకా తెలివి ఉండంగనే భర్త సిసలైన వీలునామా వ్రాసి యిచ్చి వేశాడు- ఒక ఏభైఎకరాల మాగాణీ, డెబ్భై ఎకరాలమెట్ట, మామిడితోట, నాలుగెకరాల పాటిమట్టిదొడ్డీ, పశువుల బీళ్లూ, పది అంకణాలమిద్దే, యిన్నిపాడిపశువులూ, నాలుగువందల సన్నజీవాలూ — ఒకటేమిటి, ఒకరిదగ్గరకు ఒక వస్తువుకోసం పోనక్కర లేకుండా, అమర్చిపెట్టినట్టు యినుపపెట్టె బీగాలతోసహా చేతిలో పెట్టి "ఏమో భగవంతుడుచేసిన, నేను లేనన్న కొరతతప్ప యిక నీకేమీ లోపంలేదు. ఇంట్లోతల అట్లా వీధిలో పెట్టుకోనవసరంలేకుండా ఈ యావదాస్తీ నువ్వు అనుభవించుకొని జీవించు" అని అంత్యకాలాన్న ఆశీర్వదిస్తూ ఆవిడభర్త అదృశ్యమైనాడు.

భర్త 'హరీ' అన్న మరుసటిక్షణమే లక్ష్మమ్మ యీ యావదాస్తికీ పట్టాభిషేకం కట్టుకొంది. దీనికితోడు ఆమె చిన్నదైనా, మొదటినుంచీ తనబ్రతుకుతెరువు తాను చక్కగా గ్రహించుకొన్న ఘటం. మంచి దూరాలోచనగల మనిషికూడాను. లక్ష్మమ్మది మొదటినుంచీ గట్టిపిడికిలి. ఆమె చిన్నతనంలో, సోదెచెప్పేవాళ్లు వచ్చి ఆవిడ ఎడమచేతి అయిదువేళ్లూ దగ్గరగా పెట్టించి అర్రి

చేయిచూచి వేళ్లసందున తలవెంట్రుక దూరడానికిగూడా సందులేకపోతేను ఆవిడయింట్లో లక్ష్మి తాండవం చేస్తుందని ఘంటాపథంగా జోస్యం చెప్పేవారు. ఈ జోస్యం విన్నప్పుడల్లా తల్లి లక్ష్మమ్మ నెత్తుకొని ముద్దుపెట్టుకుంటూ వుండేది. సాధారణంగా జోస్యంలో చెప్పే ముందువచ్చే విషయాలన్నీ నిజం కావని అనుకొంటాంగాని, లక్ష్మమ్మ జీవితం లోమాత్రం చెప్పిందిచెప్పినట్టుగా తూ చా తప్పకుండా జరుగుతోంది.

అదృష్టం కాకపోతే మొగవాడికైనా చేత నవుతుందా సంసారాన్ని అంతచక్కగా నిర్వహించుకోవడం, ఇంట్లో విస్తరివేసే రెండోప్రాణి లేకపోతేమట్టుకు. పొలంలోపండిన అరవైపుట్ల ధాన్యం లగాయతు దొడ్లో పశువులు వేసిన పేడవరకు సమస్తమూ ఆమె రొఖరూపంగామార్చి కష్టపడి వృద్ధిచేసిన సంసారం అది. రాగులు, సజ్జలు, జొన్నలు, మిరపకాయలు, చింతపండు, మామిడికాయలు, టెంకాయలు, టెంకాయపీచు, తాటికాయలు, తాటాకు, తాటిబుర్రలు, దొడ్లోకాసే అరటికాయలు, అరటాకు, అరటిదూట, వంకాయలు, పొట్లకాయలు, కాకరకాయలు, పాలు, పెరుగు, వెన్న, నెయ్యి-ఒకటేమిటి పాటిమట్టి, ఎరువుమట్టి, దూడాడుడుకూ—సమస్తమూగూడా ఆమెస్వంతం రొఖంగా మార్చి చేతపట్టుకొనే అలవాటు. అందువల్ల భూములు దొడ్లు, బంగారునగలు, వెండిసామానులు వగైరాల అడుమానంమీద ఇచ్చిన అప్పుపత్రాలమీదా ప్రోనోట్లమీదా సాలీనావచ్చే నాలుగువేల రూపాయల నికరం వడ్డీకితోడు, ఈ విధంగాకూడా ఎట్లాలేదన్నా సంవత్సరానికి ఇంకో ౫, ౬ వేల రూపాయల ఘట్టి ఆదాయం చేరుస్తూ ఆమె ఈ ముప్పైఏళ్లుగా తన ఆస్తిని రెండు లక్షలకుపైగా పెంచింది.

లక్ష్మమ్మ తోడపుట్టినపడుచు కాపరం అంత నాదారుస్థితికాదు కాని లక్ష్మమ్మస్థితితో పోల్చుకుంటే వాళ్లస్థితి ధూపానికి ఆగదు. అయినప్పటికీ ఆవిడ అక్కకి ఒకకొడుకూ, ఒకకూతురూ కలిగి యింతసిరీ సంపదతోనే కాలక్షేపంచేస్తున్నారు వాళ్లు. లక్ష్మమ్మ అక్కకొడుకు రామిరెడ్డికి ఇప్పుడు ముప్ఫయి సంవత్సరాలవయస్సువచ్చి, పెళ్లి చేసుకొని తన యిల్లు తాను చక్కపెట్టుకొంటున్నాడు. లక్ష్మమ్మకు 'నా' అన్నవాళ్లు ఎవ్వరూ లేనందున, తన సేద్యం మంచిసెబ్బరలు విచారించడానికీ, ఇంట్లో తనకింత లెఖ్ఖడొక్క వ్రాయడానికీ రామిరెడ్డి కాస్త చేతికందివచ్చినప్పటినుంచీలక్ష్మమ్మ అతగాడినే రప్పించుకొంటూ తనపనులు నెరవేర్చుకొంటూవుంది. అదిగాక మొగదిక్కులేని సంసారం అయినందువల్లా, ఈ తనువులు శాశ్వతం గానందువల్లా, తలలోనాలుకలాగ నమ్మకంతో అంటిపెట్టుకొని వుంటే లక్ష్మమ్మ ఎప్పటికైనా తనయావదాస్తినీ అక్కచెల్లెండ్లిద్దరి సంసారాలకీ ఒక్కడే మొగపురుగు అయిన తనకు సంక్రమించేటట్టు చేయకపోతుందా అని రామిరెడ్డి కొం

డంత ఆశపెట్టుకొని ఉన్నాడు. అది సహజమేగా. అందువల్ల లక్ష్మమ్మకు చీమకాటంత బాధ కలిగిందంటే, తనకు లోకమే మునిగిపోయినట్లుగా భావించుకొని, తన యితరపనులన్నీ గంగలో కలిసిపోయినాసరే, గుండెలు గుంఫుక్కొంటూ పరుగెత్తి ముందు తనపిన తల్లికి సేవచేసి ఆవిడ మెప్పుపొందుతూ వస్తున్నాడు రామిరెడ్డి.

లక్ష్మమ్మకు ఇప్పుడు ఏ బైయో పడిదాటి అరవైలోపడింది. రామిరెడ్డికి అనుక్షణమూ నోరు ఊటలూరుతోంది; లొట్టలువేస్తున్నాడు; ఎట్లాగైనా లాలించి ఆమెచేత యావదాస్తీ సెటిల్మెంటు వ్రాయించుకోవాలని భూమికీ ఆకాశానికీ అంచెలు వేస్తున్నాడు. కాని ఆమెదగ్గర అతగాడి పప్పులేమీ ఉడకకడంలేదింకా. కానీ చూతాంలే అనుకొని సమయంకొరకు కాచుకొని బకధ్యానం చేస్తూఉన్నాడు రామిరెడ్డి.

ఇచ్చిన అప్పు అణాదమ్మిడీలతో గూడా మళ్లా తనయింటికి పువ్వుల్లో పెట్టి తీసుకువచ్చే ఆసామీ అయితేనేతప్ప, నాలుకపెరుక్కొని చచ్చినాసరే, చిన్నడబ్బు చేబదులిచ్చేరకం గాదు లక్ష్మమ్మ. అందువల్ల ఆమెవద్దనుండి బీడా బిక్కా వగైరా అలగాజనానికి ఎప్పుడూ చీమతలకాయంత ద్రవ్యసహాయం కలుగలేదుకాని, గ్రామంలో వున్న యితర పెద్దపెద్ద ఆసాములలో చాలాభాగంవరకూ ఆమెవద్ద ఖాతాలుపెరిగి, గ్రామంలో కాస్త పలుకుబడిగల తలకాయలందరికీ ఆవిడతో మొగమాటం ఏర్పడింది. ఇక గ్రామంలో జరిగే ప్రతీమంచి చెడ్డలకీ, నలుగురితోపాటు ఆడదైనా లక్ష్మమ్మనుగూడా గ్రామపెద్దలు సంప్రదిస్తూ, ఆమెనిగ్రహానుగ్రహాలకు పాత్రులవుతూవచ్చారంటే అందులో విడ్డూరమేమీ ఉండదు.

౨

కొండుడు మాలవాడు, అనగా పంచముడు. పోనీ హరిజనుడనే అందాం. హరిజనులు నిరుపేదలని వేరే చెప్పవలసిన అవసరంలేదు. గోచీపెట్టుకొనే ఈడులో కొండడు లక్ష్మమ్మకాడనే బఱ్ఱెగొడ్లు కాస్తూవచ్చినప్పటికీ, వాడికి ఈడువచ్చి పెళ్లిచేసుకొని, భార్య కాపరానికి వచ్చినతర్వాత, వాడు లక్ష్మమ్మను వదలి యిప్పటికి పదేళ్లుగా తన రెక్కలమీదనే ఆధారపడి, యింట్లో తన భార్యనీ, డెబ్బైఏళ్ల ముసలితొక్కు తల్లి వెంకినీ పోషించుకొంటున్నాడు. శరీరకష్టం చేసుకొనేవాళ్లకు దరిద్రం ఉండదు. అందులో కొండడు ఏనుగువంటి మనిషి. ఏపని అయినప్పటికీ జంకూకొంకూ లేకుండా నడుంకట్టి దూకేస్వభావం. అందువల్ల వాడంటే ఆసాములందరికీ ఒక విధమైన ప్రేమా, అభిమానమూకూడా కద్దు.

ఏ ఆసామినో ఆశ్రయించుకొని, ఎవరికమతంలోనో అంటిపెట్టుకొని, సంవత్సరం జీతంమీద, మామూలుప్రకారమే కాలం గడుపుకొంటూఉంటే తీరేపోను కొండడికి.

కాని మున్నూట అరవైనాలుగు రోజులూ రాత్రింబగళ్లు చెమటఊడ్చిచాకిరీ చేసినప్పటికీ, సంవత్సరానికి ఏపందుంగింజలో, పన్నిద్దుంగింజలోగాని జీతంరాలని నౌకరీ అవడంవల్ల కడుపునిండక సంసారాన్ని పోషించుకోలేక వెతలుపడుతున్నాడు పాపం కొండడు.

అదిగాక యీ ఆసాములతో అన్నీ ఇక్కట్లే. జీతగాడువచ్చి పనిచేసినరోజులకు రోజు ఒకటింటికి ఒకముంతెడుగింజలుచొప్పున కూలియిచ్చి, వాడి కెప్పుడైనా ఏజ్వరమో, ఏ కడుపునొప్పో, ఏకాలునొప్పో వచ్చి నౌకరీకి రాలేక నిలిచిపోయిన రోజులకు రోజు ఒకటింటికి రెండుముంతలుచొప్పున వాడి దగ్గర తిరిగీ ముజరాలు తీసుకొంటారు, ఇదేమి నాయమో! అదిగాక, ఆసాములు జీతగాళ్లకూ, కూలివాళ్లకూ తమగింజలు కొలవవలసివచ్చినపుడు కొలిచేముంత వేరూ, జీతగాళ్లదగ్గరనుంచి ఆసాములు ముజరాతీసుకొనేటప్పుడు కొలిచేముంత వేరూ — మొదటి ముంత చిన్నదీ, రెండోముంత పెద్దదీని. ఇట్లాంటి దుర్భరమైన పరిస్థితులలో ఎన్నాళ్లు బ్రతకగలడు పాపం కొండడు?

ఈ కష్టాటలన్నీ పడలేక,— ఆ వూళ్లో మాలమాదిగలకు పదికుటుంబాలవాళ్లకు సర్కారువారు ఈ సందుకట్ల కొన్ని బీడు భూములు సాగుబడిచేసుకొనేటందుకు పట్టాలకు యిస్తున్నారంటే, కొండడుకూడా తాశీలుదారుగారిదగ్గర వో అర్జీ గీకించి దాఖలుచేశాడు. కొండడికిగాని, వాడి అవిభక్తకుటుంబంలో మరియెవ్వరికిగాని, అంతకు పూర్వం ఎన్నడూ సర్కారుభూములు పట్టాకుయిచ్చి ఉండకపోవడంచేత గ్రామంలో ఇతరులతోపాటు వీడికిగూడా, ఒక ఏభైసెంట్లు (అర ఎకరా)భూమి ఎకరా మూడువందలరూపాయలచొప్పున ఖరీదువేసి, అరెకరమూ నూటయాభైరూపాయలకు, సర్కారువారు కొండడికి పట్టా కిచ్చారు. ఎక్కడనో, ఏ అయ్యనో, ఏ అమ్మనో కాళ్లూకడుపూ పట్టుకొని, ఆ నూటయేభైరూపాయలూ గాక యింకా రెవిన్యూయినస్పెక్టరుకూ, తాలూకాగుమస్తాలకూ ఇవ్వవలసిన నజరానాల కింద ఇంకోపాతికా ఏభైరూపాయలు తలతాకట్టుపెట్టి, అప్పుతెచ్చి కట్టి భూమిని తీసుకొన్నాడు కొండడు. ఇంతా చేస్తే చచ్చినంత మరమ్మతు చేస్తేనేగాని సాగుబడికి లాయఖుకాని భూమి అది; మనిషెత్తున తుంగ బలిసిపోయి అది వున్నట్టుంది. అదీ గాక, నీళ్లకు మిట్టప్రదేశం. అరగజం గడ్డతీరు తీయిస్తేనేగాని కయ్యలోకి చుక్క ఎక్కదు. నీళ్లుపారించుకొనేటందుకు ఆకయ్యకు ప్రత్యేకకాలువ లేదు. అన్నీ తంటాలే పాపం; సర్కారువారు విధించినక్రయం నూటయేభైరూపాయలూ ఖజానాలో జమకట్టంగనే, సర్కారువారు కొండడిచేతిలో పట్టాకాగితంమాత్రం పెట్టి, నలుగురితోపాటు, వాడికిగూడా 'యిదుగో ఇదీ నీభూమి' అని ఆకయ్యకు హద్దులు చూపించి చక్కాపోయారు.

సెంటుకు కనీసం ఒకరూపాయచొప్పున ఏభైసెంట్లకు ఏభైరూపాయలు ఖర్చుపెట్టితేనేగాని కయ్యా మరమ్మత్తుకాదు. తుంగా దుడుసూ కొట్టించడానికే ఒకయిద్దుమో, ముత్తుమో కావలసి ఉండె! ఏరోజు కా రోజు రెక్కాడితేనేగాని డొక్కాడకపోయె ఇంట్లో కొండడికి! ఈలోకంలో తాను జన్మమెత్తినందుకు ఈజన్మలో తన పేరిట ఇదీ తనభూమి అని వోయెకరాభూమి ఏర్పడితే తనజన్మ తరించి తనకష్టాలు గట్టెక్కుతాయనే ఆశపడ్డాడుకాని కొండడు, తీరాభూమి దఖలుపడినతర్వాత ఆకయ్యాను సాగుబడి చేసుకోవాలంటే తన శక్తి కణుకువైన పనిలా తోచలేదు కొండడికి. ఇప్పటికి చేసిన అప్పు తలుచుకొంటేనే వాడికి శరీరం నీరయిపోతోంది. భూమిదగ్గరికి వచ్చి చూచుకొంటే దిక్కు తోచడంలేదు. భూమి సాగుబడిచేసుకోవడమా, లేక అంతటితో దాన్ని విరమించుకొని తాను మళ్లా మామూలు ప్రకారం ఏ అయ్యాకాడనో జీతానికి కుదరడమా? ఈరెంటి సందునాపడి నలిగిపోతున్నాడు కొండడు. "అయిందేదో అయిపోయింది. మనకీజన్మలో స్వంతకయ్యానీ, స్వంతసేద్యమనీ, స్వంతెద్దులనీ అనుకొనేప్రాప్తం లేదు. అందనిచెట్టుపండ్లకు ఆశలుపడ్డాం. ఇంతటితో ఈకయ్యాను పోకడపెడుదా"మనుకొని నిస్పృహచెంది కొండడు ఆకయ్యా చేసుకోలేక, పట్టావచ్చిన మరుసటినెల లోనే యితరులకు అమ్మకం చూపేడు.

కొండడికి పట్టాకిచ్చిన కయ్యా లక్ష్మమ్మ స్వంత పట్టాభూమి, నూరెకరాల యేక ఖండంగల ఒకనట్టుకు దక్షిణపుతట్టున ఆనుకొని ఉన్నది. కయ్యానందునా, లక్ష్మమ్మ భూమినందునా గనిమె తీస్తే, చాలాగ్గా కయ్యా ఆవిడఖండంలోకి కలిసిపోతుంది. ఆ కయ్యాకోసరం ముప్ఫయ్యేళ్లకుపూర్వం లక్ష్మమ్మభర్త దాన్ని తనభూమిలో కలుపుకోవాలని రివిన్యూ అధికార్లకూ, డి. పి. డబ్ల్యూ అధికార్లకూ లంచాలక్రింద ఒక ముప్ఫైనల్భై రూపాయలు ఖర్చుపెట్టీ కూడా ఆభూమి పట్టాకివ్వడం ఆక్షేపణకరమని అప్పట్లో సర్కారువారు తీర్మానించడంవల్ల విఫలమనోరథు డయినాడట! అదిలగాయతు భర్త చనిపోయినతర్వాతకూడా, ఆశపడ్డకయ్యా చివరకు లభించకపోవడమే కాకుండా, దానికొరకు లంచాలుగా పోసిన నల్భైరూపాయలూ నష్టేటకలిసిపోయెనే అని లక్ష్మమ్మ అప్పటికీ యిప్పటికీ ఆ విషయం తలుచుకొని, తలుచుకొని కుళ్లిపోతూ ఉంటుంది. ఎట్లాగైనా కయ్యాలోకయ్యాను కలుపుకోవాలని ఆవిడకూడా ఒకటిరెండుసార్లు ప్రయత్నించింది గాని ఆవిడ ప్రయత్నం కొనసాగలేదు. అందువల్ల, ఆ కయ్యాను లక్షాధికారైన తాను కోరినపుడు పట్టాకు ఇవ్వకుండా యిప్పుడు ఒక మాలవాడికి పట్టా కిచ్చారనేసరికి లక్ష్మమ్మకు ఆపాదమస్తకమూ! తేళ్లూ జెర్రెలూ పాకినట్టయిపోయింది. తనకయ్యాకింద మాలవాడు ప్రవేశిం

చాడని విన్నప్పటినుంచీ ఈ నెల్లాళ్లుగా ఆమె అన్నంతినక మంచంపట్టింది. రాత్రింబగళ్లు వాణ్ణి దుమ్మెత్తిపోస్తోంది. వాడివంశం నాశనం కావాలని శాపనార్థాలు పాడుతోంది.

కొండడికి చేతిలో దమ్మిడీలేక ఒక్కదున్నపోతుగాని, ఒక్క అరకకొయ్యకాని లేక రెండువందలరూపాయలతో ఆశపడి తెచ్చుకొన్న కయ్యను సాగుబడిచేసుకొనే దారీతెన్నూ కనపడక దిగులుపడి ఉక్కిరిబిక్కిరయి వాడు తన్నుకులాడుకుంటూ ఉంటే, తనభూమిలో కలిసేకయ్యను తాను ఇంతప్రయత్నించినా తెచ్చుకోలేక ఆఖరుకు చూస్తూవుండగా తనకళ్లయెదుట ఒక హీనజాతి మాలవాడు తన్నుకు పోతున్నాడే, ఎట్లాగబ్బా ఈలోకంలో జీవించేదని యింట్లో లక్ష్మమ్మ మరణవేదనపడుతోంది.

అట్టినమయంలో కొండడు ఆ భూమి అమ్మకం చూపాడని, వినీ వినడంతోనే లక్ష్మమ్మ ప్రాణాలు లేచివచ్చినట్లుగా సంతోషించి రామిరెడ్డిచేత మాలవాడికి కబురు చేసింది, బేర మాడింది. తాను ఖర్చుపెట్టిన రూపాయలు తనకిచ్చివేస్తే ఆక్షణంలో భూమిని వదులుకొంటానని కొండడు జవాబు చెప్పాడు. వా డామాట అనేసరికి లక్ష్మమ్మ గుండెలు బాదుకొని—

"అమ్మయ్యో! నీ కెంతదురాశ పుట్టిందిరా మాలముండకొడుకా! బ్రతకడానికా నాశనంకావడానికా ఇట్లాంటి దుర్బుద్ధులు పుట్టింది నీకు? ఈకయ్యకుగాను నామగడు ముప్పైఏళ్లనాడు దూటబిళ్లలలాగ, నలభై రూపాయలు ఆసర్కారువారి మెదాన్ని కొట్టినాడు. ఈముప్పై ఏళ్లుగా నలభైరూపాయలకూ వడ్డీ కట్టుకొంటే నూఱురూపాయలయింది. ఈనష్టం నీతాత ఇస్తాడనుకొన్నావా, నీముత్తాత యిస్తాడనుకొన్నావా? ఊరికే దురాశలకు పోబోకు దుఃఖానికి చేటు. ఎట్లాగా ఆకయ్య నీవు మరమ్మతు చేసుకోలేవు. మరమ్మత్తుకుగాను నే నింకా ఏభైరూపాయలు ఖర్చుచెయ్యాలిసుంది. అప్పటికి నాకు నూటయేభయిరూపాయలవుతుంది. తెలిసిందా? నీవు పాపం ఈసందునా ఆసందునా కచ్చేరిచుట్టు తిరిగి డబ్బు ఖర్చుపెట్టావు కాబట్టి అందుకు భత్యఖర్చులకింద పది రూపాయ లిస్తాను. ఆకయ్య నాపేర విక్రయం చేసి పారెయ్యి" అన్నది.

"అమ్మయ్యో! నీ కెంతదురాశ పుట్టిందమ్మా" అని కొండడుకూడా గుండెలుబాదుకొంటూ వెళ్లిపోయాడు.

3

తాను రెండువందలు పెట్టి కొన్న కయ్యను పదిరూపాయల కిమ్మని లక్ష్మమ్మ చేసినబేరాన్ని తలుచుకొనేవరకు కొండడికి, అదివరకున్న నిరాశా నిస్పృహా వదలి, ఎట్లాగైనా సాధించి కయ్యను నిలబెట్టుకొని సాగుబడిచేసుకోవాలన్న పౌరుషం పుట్టుకొచ్చింది. "నేను దిగులుపడి నిస్సహాయస్థితిలో ఉండబట్టిగదా ఆమె నాకయ్య నింత హీనక్రయా

నికి అడిగింది. దేవుడు చల్లంగాచూస్తే నేను బతకలేకపోతానా? నేనేమీ లోకులడబ్బుకోసం ఆశపడలేదే" అనుకొని ధైర్యం తెచ్చుకొని, దేవుడిమీదే భారంవేసి కొండడు ఊళ్ళోకి చక్కా వెళ్ళాడు; మొదటి మారాజునే మళ్ళా బ్రతిమలాడుకొని, యింకో ౫౦ రూపాయలకి ప్రోనోటు వ్రాశాడు; ఆపైకంతో భూమి మరమ్మత్తుచేసి ఆ సంవత్సరం శ్రావణ మాసంరాగనే వరినాటు వేశాడు. ఇరవైముప్ఫై యేళ్లుగా బీడుగావున్న భూమేమో ఆ సంవత్సరం కాలం సక్రమంగా రావడంచేత నారు గుచ్చీగుచ్చంగనే, కర్రలు నలుపుతిరిగి గంటలుకట్టి పైరు నవనవలాడుతూ ఎక్కివచ్చి అర యెకరాకయ్యా ఒకపుట్టెడుగింజలదాకా చితకపండింది. కొండడికి కొంత ధైర్యం చిక్కింది. దేవుడికృప చల్లంగుంటే, నాలుగేళ్లలో అప్పుతీర్చేసి బయటపడతామనుకొని, సాయంకాలం ఇంటికిపోయి, ఉడుకునీళ్లుపోసుకొని, ఆరబయట నులకకుక్కిమీద పండుకొన్నప్పుడల్లా ఏమేమో వ్యూహాలతో మేడలు కడుతూనే ఉన్నాడు.

కొండడితో బేరం చెడ్డప్పటినుంచీ లక్ష్మమ్మకు దిగులుగానేవుంది. తనకయ్యలో కలిసే కయ్యను చూచిచూచి వదులుకోవడానికీ ఆవిడ కిష్టంలేదు; పోనీ ఎంత అయినా సరే, డబ్బిచ్చి తీసుకొందామనుకొంటే - చేతులార అన్ని రూపాయలు మాలవాడిచేతిలోపోయడానికీ మనసొప్ప లేదు. రోజులుగడచినకొద్దీ ఆరోజుకారోజు ఆవిడకు కడుపులో యీబాధ జాస్తీ అవుతూవచ్చింది. దానికి తోడు ఆ యేడు తననూరెకరాలనట్టువా సగటున ఎకరానికి ఓ పుట్టెడుగింజలు పండి, తన యింట్లో నూరుపుట్లూ వేసుకొనీకూడా తన నట్టువలో కలిసేకయ్య అరెకరమే మాలవాడికి పుట్టెడుగింజలు పండిందని తలుచుకొని తలచుకొని ఆవిడకు కడుపు దహించుకొని పోతోంది. మాలవాడికి పండిన దామాషా ప్రకారం ఎకరం రెండుపుట్లచొప్పున తననూరు ఎకరాలకూ రెండువందలపుట్లూ రాలేదే అనేచింత ఒకతట్టూ, పోనీ తనకు రాకపోతే పోయె పూటకు గతిలేని మాలవాడికి నిముషాలమీద అర యెకరానికి పుట్టెడు గింజలు వచ్చినవే అన్న దుఃఖం మరొకతట్టూ ఆవిడను కాల్చి నుసిచేస్తూ ఉన్నవి.

ఆవిడమనోవేదనకు అంతు కన్పించడం లేదు. ఒకటిరెండుసార్లు రామిరెడ్డిని పిలిపించి "అబ్బాయీ! ఏమిగతిరా, మాలావాడు బంగారంవంటి అరెకరాకయ్యా అద్ధాన్నం చేసి తనపొట్ట పెట్టుకొన్నాడు వాడికడుపు వాడితోనేకాల! నేను ఏబావో ఏగొయ్యో చూసుకోవలసిందే గాని గతిలేదిక. తలకింద కొరివెట్టుకొన్నట్లు ఈమాలమాదిగకొడుకుని నాకయ్యలకింద పెట్టుకొని నేను నలుగురిలోనూ తలయెత్తి ఇక ఈగడ్డమీద కాపురం చెయ్యలేను. అన్నిటికీ నువ్వే వున్నావు. ఏం చేస్తావో చెయ్యి" అని సొదపెట్టింది. "కానీలే అమ్మా! తొందర పడబోకు. వాణ్ణి అక్కడనుండి లేవగొట్టే ఉపాయం ఆలో

చిద్దాంలే. కాస్త నిదానించు" అని రామిరెడ్డి కొంతధైర్యం కలిగేటట్టు ఆమె నూరడించాడు. కాని లక్ష్మమ్మకు మనస్సు కుదుటపడలేదు.

జ్యేష్ఠమాసం వచ్చింది. తొలకరించింది. రైతులు నార్లు వేసుకొంటున్నారు. పొలాల్లోకి ఎరువు బూడిద తోలుకొంటున్నారు. తొలకరికి భూమి కాస్త మెత్తపడడంచేత కొంతమంది ఆతడిమీదే అరకలుకట్టి ఒకటిరెండు చాళ్లు వెలిదుక్కులు చేస్తున్నారు కొండడుకూడా తనకయ్యలోకి ఎరువుతోలడానికి, ఎవరినో ఎర వడిగి ఒకకాడి దున్నపోతులు తెచ్చుకొని బండికట్టాడు. తనూ, తనభార్యా-యిద్దరూ చెరొకగంపా తీసుకొని, వోయిరవైగంపలు జల్లిలో పోశారు. ఇక బరువు లాగలేవు దున్నలనుకొని కొండడు బండియెక్కాడు; కొరడా ఆడించాడు; సగం దూరం బండిని తోలుకువచ్చాడు.

కొండడికయ్యకు తూర్పునా, ఉత్తరాన్నా, పడమరాకూడాలక్ష్మమ్మపొలంకమ్ముకువుంది. దక్షిణపుతట్టుమాత్రం సర్కారు అసలు మినహా చెరువుతొట్టు పోరంబోకుభూములున్నవి. తనకయ్యకి పోవడానికి కొండడు లక్ష్మమ్మభూములగుండా పోయితీరాలి. వాడికి మరో మార్గంలేదు. పడమరగా ముప్పాతిక మైలు పోతే చెరువులోకిపోయే డొంక ఉంది గాని అది చాలా చుట్టు. సుమారు రెండుమూడువందల యెకరాలభూమిని చుట్టుకొస్తేనేగాని కొండ డాదారిగుండా తనకయ్యలోకి రాలేదు. ఎరువుబండి తోలుకొని కొండడు తనకయ్యల్లోనుంచి పోతున్నాడని లక్ష్మమ్మకు తెలిసింది. వెంటనే యిద్దరు సేద్యగాళ్లను పంపి బండిని మళ్లగొట్టించింది.

కొండడికేమీ పాలుపోవడంలేదు. పోనీ బండిని ప్రదక్షిణం చేయించి తీసుకుపోదామనుకొంటే రెండుసబుర్లు తోలేవరకే పొద్దుగుంకుతుంది. ఊరికీ తనకయ్యకీ ఓమైలుంది. ఆసాములందరూ అనాదిగా సంపాదించుకొన్న మంచి మంచి భూములన్నీ పోను, మాలమాదిగల కెక్కడో పొలిమేరను కెనరుగా నాలుగు కయ్య లిచ్చారు సర్కారువారు. ఊరికి అందుబాటులోనూ, చేరువలోనూ ఇవ్వడానికి ఖాళీభూము లుంటేగా. ఎక్కడా సూదిమోపేటంత స్థలం కూడాలేదు. అసలే దూరంగా ఉన్న తన అరెకరాభాగ్యానికీ మూడునాలుగుమైళ్లు ప్రదక్షిణం తిరిగి సేద్యం చేసుకోవాలంటే, అలవయినపనిగా కనపడలేదు కొండడికి. అందువల్ల బండి నక్కడే విప్పకొని, కొండ డింటికిపోయి భార్యను పిలుచుకొని, యిద్దరూ చెరొకగంపా నెత్తిన పెట్టుకొని, ఎట్లాగైతేనేం, రెండోరోజు సాయంత్రానికి అరెకరాకయ్యలోనూ ఓ ఆరుబళ్ళ యెరువు మెడనరాలు మెలితిరిగేటట్టు మోసి మోసి కయ్యలో పోశారు.

లక్ష్మమ్మకు ఒళ్లు గాభరా పుట్టుకొస్తోంది. ఏవిధాన్నా మాలవాడు లోబడడంలేదు. ఆఖరుకు ఆ మధ్య ఒకసారి కొండడి అరకదున్నిన పశువులు పగటివేళ లక్ష్మమ్మ

పొలంలోవున్న మంచినీళ్ళ దొరువుకాడికి నీళ్లు తాగను పోతే, తనదొరువులో నీళ్లు తాగడానికి వీల్లేదని ఆవిడ పశువులను మళ్ళగొట్టి బందెలదొడ్డిలో పెట్టించింది దేవుడా అంటూ పశువు ౧కి ౦-౧౨-౦ వంతున ౪ పశువులకూ 3 రూపాయలుకట్టి,కొండడుపశువులను బందె నుండి విడిపించుకొన్నాడు. లక్ష్మమ్మ ఇంకా ఏమేమో చేస్తూనే వుంది. ఎన్ని చేసినా మరునటి సంవత్సరంకూడా కొండడు మొండికెత్తి, అన్నికష్టనిష్టూరాలకూ తలవొగ్గి ఎట్లాగైతేనేం నలుగురితోపాటు తనుకూడా సకాలంలోనే తనకయ్యను సాగుబడిచేసుకొని మొలగొలుకులు నారుగుచ్చాడు. ఆయేడుకూడా కాలం సరిగ్గానే రావడంవల్ల సకాలంలో మూడు, నాలుగు వర్షాలు కురిసి పైరు ఆరంభంలో బాగానే ఎక్కివచ్చినా, వెన్నుతీసి పొట్టమీదికి వచ్చేవరకు వర్షం బిగించి, కాలం బెట్టచేసి నీళ్లకు ఎద్దడయింది. ఎంత యెద్దడయినా, లక్ష్మమ్మబోటి మారాజులు మాత్రం బీదలనోటిలో మట్టికొట్టి కాలువల్లో వచ్చే నాలుగుచుక్కలూ తమ పొలాలకే పెట్టుకొని, తమపైరుమాత్రం ఎండిపోకుండా కాపాడుకొంటూవచ్చారు. కొండడి కయ్యకు నీరు పాకుదలఅయ్యేటందుకు ప్రత్యేకంకాల్వ లేదు. మడవతీస్తే నీళ్లు లక్ష్మమ్మకయ్యలో నుంచి తనకయ్యలోకి రావాలి. నిరుడుకూడా ఆమెకయ్యమీాది మడవగుండానే పారించుకొన్నాడు కొండడు. ఈ సంవత్సరంమాత్రం లక్ష్మమ్మ మామూలుమడవనుపూడ్చి వేసి, తనకయ్యలోనీళ్లు మాలవాడి కయ్యలోకి చుక్క ఎక్కిరాకుండా, గనిమెగజంఎత్తున మట్టిపోసి గట్టిపరిచి, తనకయ్యలో అదనంగా నిలిచే పులకనీళ్ళకుపడమటితట్టు చెరువులోకిపొయ్యేటట్టు ఇంకో కొత్తమడవ పెట్టించింది. ఆయేడు బీదలపొలాలకు నీరు చాలక పైర్లు ఎండిపోతూవున్నప్పటికీ అదృష్టం కొద్ది లక్ష్మమ్మకయ్యలో మోకాలులోతు నీళ్ళు నిలవడమేకాకుండా, ఇంకా పైనీళ్ళన్నీ వచ్చి పడడంచేత అదనమై ఈ సంవత్సరం కొత్తగా పెట్టించిన మడవగుండా అవన్నీ చెరువుతొట్టిలోకి వృథాగాపోతున్నవి. అందుకైనా వొప్పుకొందిగాని మామూలు మడవగుండా కొండడిచేలోకి చుక్కకూడా పోవడానికి లక్ష్మమ్మ వొప్పుకోలేదు. పోనీ చెర్వుతొట్టిలోకి పోయిననీళ్ళు తన కయ్యలోకి కాలవత్రవ్వకొని మళ్లించుకొందామనుకొన్నాడు కొండడు కాని తనకయ్య చెర్వుతొట్టికంటె మిర్రుగా వుండడంచేత నీళ్లెక్కక, ఆ ప్రయత్నం చాలించుకోవలసి వచ్చింది వాడు.

ఫలితానికి వచ్చినపైరు. ఆరునెలలుగా చెమట వూడ్చి కష్టంచేసి పెంచుకొన్నపైరు. ఇంక లెఖ్ఖ రెండుతళ్లు తగిలితే మళ్ళా ఒక పుట్టెడుగింజలు నమ్మకంగా పండుతవి. కాని తనకయ్యలోకి నీళ్లువచ్చేమార్గం కనబడలేదు వాడికి. లక్ష్మమ్మ కరుణించాలె; తనకు నీళ్లు ప్రసాదించాలె. నీళ్లులేక కయ్య ఎండిపోతాోంది. తడి ఆరి అడుగువేస్తే దిగబడడంలేదు. క్రమ

క్రమంగా చెమ్మ ఆరిపోయి, కయ్యలోని వరి గంటలసందుల్లో భూమి బద్దలయి బీటలు తీస్తోంది. కయ్య చూచుకొనేకొద్దీ కొండడి హృదయంకూడా ఎండి బీటలు తీస్తోంది. హృదయం ఎంత మెండిపోయినప్పటికీ వాడి కళ్ళల్లో తడిమాత్రం ఆరలేదింకా. ఎంత అడ్డు కట్టవేసినా వాడి కన్నీళ్ళప్రవాహం కట్టుబడకుండా ఉంది. దానివల్లనైనా ఎండిపోతున్న పైరును కాపాడుకొందా మన్నట్టుగా, గనిమెమీద కూర్చొని తూర్పుముఖంగా తిరిగి, మోకాలిమీద తలెట్టుకొని, డొక్కలెగరవేస్తూ, వెక్కివెక్కి రోదనం చేస్తున్నాడు కొండడు. కాని మెండిపోయి బీటలు తీసిన కయ్యను మెత్తనచేయడానికి ఆ ప్రవాహం చాలలేదు.

కళ్లు కాయలుకాసేటట్లు ఒకగంటసేపు ఏడ్చాడు. కళ్లు ఎర్రబడినవి. తలపైకెత్తిచూచాడు. సూర్యుడు నెత్తిమీదకి రాబోతున్నాడు. "సూర్యభగవానుడా! నీకుకూడా కరుణ లేదా సామీ! ఇంతతీక్షణంగా నువ్వు నీకిరణాలన్నిటినీ విడిచిపెట్టితే, కోమలమైన నాపైరు ఎండిపోయి మలమలమాడిపోతోందే! చెమటపూడ్చి ఆరుమాసాలుగా చేసిన సేద్యం మట్టిపాలైపోతోందే! ఎవరితో చెప్పకోను సామీ!" అని రెండుచేతులూ ఎత్తి వలవల ఏడ్చాడు కొండడు. ఒక్కపదునువర్షం కురిస్తేచాలు ననుకొన్నాడు. ఆఖరుకు ఇంత మబ్బుతునకయినా అడ్డువస్తే పైరుకు వేడి తప్పిపోననుకొన్నాడు.

పొద్దు నెత్తిమీదికి వచ్చింది. నీళ్లులేక పైరు మాడిపోతున్నట్టుగానే, పొద్దుటినుండి చద్దిదాహమైనా లేక వాడికడుపుకూడ మాడిపోతోంది. ఇంటికిపోయినాడు. ఇంతఅన్నం గతి కాదు. భార్యను పిలిచాడు. ఇద్దరూకలిసి ఒక గూడ సంపాదించారు. నేరుగా కయ్యకాడికి పోయారు. లక్ష్మమ్మకయ్యల్లోనుండి చెరువులోనికి పోయేనీటికి అడ్డుకట్టవేసి, ఒకసన్నని కాలువతీసి, గూడతో పొద్దుగూకులూ నీళ్లు ఎత్తిపోశారు. కాని వెనుకవాలుగా ఉన్న ఆ ప్రదేశంగుండా నీళ్లు కయ్యలో కెక్కలేదు. అయినప్పటికీ చీకటిపడేవరకు నాలుగోవంతు కయ్య సుమారుగా తడిసింది: రాత్రి యింటికి పోయి, నీళ్లు పోసుకొని, కూడుతిని, పదిగంటలకు వెన్నెట్లో మళ్లా కయ్యకాడికిపోయి తెల్లవారుజామున కోడికూసేవరకూ నడుములు పడిపోయేటట్లు భార్యాభర్త లిద్దరూ ఆ గూడతో నీళ్లెత్తి పోస్తూనేఉన్నారు. ఆతడితో పైరు కొంచెం పాటుకు తిరుక్కున్నప్పటికీ, ముప్పైలంఖణాలు చేసి పథ్యం పుచ్చుకొన్న రోగి ఎక్కివచ్చినట్టయి, అదునుతప్పిన తడి అయినందున పుట్టెడుగింజలు కావలసిన కయ్య అర్థపంటపండి, ఒకపందుంగింజలు రాలింది. తన కెంతప్రాప్తమో అంతే ననుకొన్నాడు కొండడు.

పుష్యమాసం వచ్చింది. పైర్లన్నీ పంటలకువచ్చినై. కూలివాండ్లందరూ కోతలకు వంగారు. వారంరోజులలో తనపైరుయావత్తూ కోయించి కుప్పలు వేయించింది లక్ష్మమ్మ.

కూటికికొఱతబడ్డ యానాదులు, ఎరుకలు, మాలలు, మాదిగలు వగైరా అలబరిజనం పైరుకోతయినపొలాల్లోకిపోయి,పన అడుగున మిగిలిన పరిగకర్రలొక్కొక్కటే ఏరుకొనిసాయంకాలానికి ఓసందెడుకట్ట అయ్యేటట్టుగా కట్టుకొని, ఇళ్లకు తెచ్చుకొంటున్నారు.

కొండడితల్లి వెంకి ముసలిది అయినా పూర్వకాలపు మనిషయినందున డెబ్భయ్యో పడిలోకూడా శరీరంచేవ దేరి ఇంకా దారుఢ్యంగానే ఉంది. మొదటినుంచీ కాయకష్టం చేసిన అలవాటుకొద్దీ, అది యిప్పుడుకూడా ఒక్కనిముషం ఇంట్లో ఊరికే కూర్చోలేదు. పొయిలోకి ఇన్నిచితుకు లేరుకు రావడమో, ఇంత పేడ పోగుచేసి పిడకలు చేసుకోవడమో, ఆసాములు కుప్పలునూర్చి పుట్లుపుట్లుధాన్యం బండ్లమీద తోలుకొనిపోయిం తర్వాత కళ్ళంలో తడినేల కంటుకొనిపోయిన గింజలను పత్తిపుల్లల చీపురుతోనో, కంది పుల్లల చీపురుతోనో పొద్దుగుంకులూ నడుమడిపోయేటట్టు వంగి, ఒక్కొక్కగింజే కళ్ళంలోని మట్టిగడ్డలతోసహా గీకి గీకి, ఆవిధంగా పొద్దుగూకేవరకు ఏ అర్ధశేరుగింజలో చేటలో వేసుకొని ఇంట్లోకి చేర్చడమో - ఇట్లాగే ఏదో ఒకవిధాన్న తానుకూడా కష్టపడి సంసారానికి కాస్త సాయపడుతూనేఉంది. ఆయలవాటుకొద్దీ, ఈ సంవత్సరం కోతలు పూర్తి అయి కుప్పలుపడడంతోనే నలుగురితోపాటు వెంకి పదిరోజులపాటు వరికొయ్యకాలంతా తిరిగితిరిగి ఒక అరమోపు పరిగకయ్యలు పోగుచేసి ఇంట్లో చేర్చింది.

కొండడుకూడా తనకయ్యలో పైరుకోశాడు. వెంటనే ఆ పందుంగింజలపంటా పన మీదనే పిడివాటుకొట్టేదా మనుకొన్నాడు కాని కొంచెం నిదానించి పిడివాటుకొట్టితే ఇంకా గింజలు కర్రకంటుకొని సరిగ్గారాలవేమో, ఇంతాచేస్తే పంటకాస్తా పలాములయిపోతుందని భయపడి, ఒక్కవారంరోజులు కాస్త వెసులుబాటు చూసుకొని నాలుగు బర్రెగొడ్డుల్ని వాటినీ మళ్లించి తొక్కిద్దామని ఆలోచనచేసి కయ్యలోనే ఒకచిన్న కుప్ప పడవేశాడు కొండడు. లక్ష్మమ్మ కూడా కొండడికయ్యకి అనుకొనివున్న నూరెకరాలపంటా కోయించి, అక్కడక్కడ నాలుగుకుప్పలు వేయించింది.

౪

కోతలుముగిసి కుప్పలుపడేవరకు రైతాంగానికి రవంత వెసిలిక చిక్కింది. ఆట్టే ఆలోచించుకోగా తనకయ్యకి దిగులులేకుండా నీళ్లు పారేకాలవ లేకపోవడం కొండడికి చికాకుగా తోచింది. ఇక లక్ష్మమ్మమీద ఆశలుపెట్టుకొంటే ఉపయోగంలేదనుకొన్నాడు.అయినా తన కయ్యకు కాలవ కావలెనంటే ఎట్లాగా లక్ష్మమ్మకయ్యలోనుండే తనకు రావాలె, విధిలేదు కాబట్టి ముందు లక్ష్మమ్మ నడిగి ఆమెచేత కాదనిపించుకొన్న తర్వాతనే పైవ్యవహారం చూచుకొంచా మనుకొని ఒకరోజు కొండడు లక్ష్మమ్మ ఇంటికిపోయి:

"అమ్మా! నువ్వు గొప్పమారాజువు. నామీదపగబట్టితే నే బతకలేను. నీదయవల్ల చిన్నతనంలో నాకు గంజిపోసి బతికించావు. ఇప్పుడు పెద్దవాణ్ణయినతర్వాతకూడా నువ్వే అన్నంపెట్టాలసినగండం వచ్చింది. అయిందేదో అయిపోయింది. కాని అమ్మా! నీకు దణ్ణంపెట్టుతా. నీకయ్యలోనుంచి నాకయ్యలోకి జానెడువెడల్పు కాలవగనుక ఇస్తివా, నీపేర దీపంపెట్టుకొని మొక్కుకుంటా" అని అడిగాడు కొండడు.

"కాలవా! నీకా! ఎంతతల తిరిగిపోయిందిరా కొండా! నీకు. ముష్టి అరమెకరా కయ్య చేతిలోకివచ్చి రెండోయేడింకా జరుగలేదు, అప్పుడే నీకయ్యకు కాలవలూ మడవలూ కావలసివచ్చినైగా! ఔరా: అయిన నూరురూపాయల కయ్యా - మానోటికాడ అన్నం - ఎత్తుకొనిపోయి నీమొదాన్న పెట్టుకోవడమేకాకుండా పైగా కాలవకోసరం బేరానికి వచ్చావయ్యా?–ఇస్తా. కాలవ ఇస్తానులే ఉండు; ఈ పొంగు బోర్లాపడడానికే వచ్చిందిలే నీకు. ఎందుకు పాపం అని అజ్ఞయించి ఊరుకొనివుండా. ఈపాలి నాకయ్య తొక్కిచూడు. రెండుకాళ్లూ విరగగొట్టిస్తా" అంది లక్ష్మమ్మ.

"నాకు ఊరికనే పనిలేదులే అమ్మా! కాలవకుగాను నీ విచ్ఛేస్థలానికి క్రమమైన క్రయంగట్టి, డబ్బుతీసుకొని మరీ యిద్దువుగానిలే" అన్నాడు కొండడు.

"ఛీ! నోరుమూసుకొని బయటికిపో మాలమాదిగకొడకా! శుభమల్లె మంగళవారప్పూటా ఇంటిముంగిటికి వచ్చి, కయ్యమ్మకో కాలవమ్మకో అని వెధవకూతలు కూస్తావు. నోట్లో పొడిపిస్తా చూడు. నాకేం గ్రహచారంపట్టలేదు నీకు నామళ్లూ మాన్యాలూ అమ్ముకోడానికి. ఈపాలి కాలవ సంగతి ఎత్తావంటే మాటదక్కదు. పో" అని లక్ష్మమ్మ కసురుకుంది.

ఇక లాభంలేదనుకొని కొండడు ఆ వెళ్ళడం వెళ్ళడం తిన్నగా ఆఫిర్కా రివిన్యూయినస్పెక్టరుదగ్గరకు వెళ్లాడు. అదివరలో కొండడికయ్యకు పట్టాకు తెప్పించినప్పుడు కొంత మేతమేసినగొడ్డు కావట్టి, రెవిన్యూయినస్పెక్టరుకు వాణ్ని చూడడంతోనే నోర్లు ఊటలూరింది. కొండడు చెప్పుకొన్న విన్నపం విన్నాడు. 'ఇది మనచేతిలోపని ఎంతసేపు. ఎల్లుండి మర్నాటికి కాలవకు ఉత్తరువు తెప్పించిపెడతా' నని నమ్మకంచెప్పి అనుకొన్నదానిలో ముందుగా సగమూ, పని పూర్తయిన తర్వాత మిగిలిన సగమూ కొండడు తనకిచ్చేటట్టు ఖరారంటే ఖరారు చేసుకొని, మొదటిసగం అయిదు రూపాయలూ ఆక్షణంలోనే చేతిలోకి రాల్చుకొన్నాడు, 'రేపు జాగ్రత్త' అనే బ్రతుకు తెరువు తెలుసుకొన్న ఆ నియోగిరెవిన్యూ ఇనస్పెక్టరు. వెంటనే తహశీలుదారుకూ, డిప్టికలెక్టరుకూ అర్జీలువ్రాసి పోస్టులో రిజిష్టరు చేయవలసిందని కొండడితో చెప్పుతూ

"ఒరే: కొండా! ఇక్కడ ఇనస్పెక్టరుని ఎట్లాగో తృప్తిపరిచాంగదా ఇక మనకేమీ పరవాలేదనుకొని తాత్సారం చేసి ఊరుకొంటావేమో. ఇవి డెల్టాకొంపలు. ప్రతీ పనికీ డి.పి.డబ్ల్యువారితోనూమాతోనూకూడా అవసరంఉంటుంది. తీరాఫలితానికి రాబోయ్యే సమయంలో ఆవోవరుసీరు ముండావాడు ఒక కలంపోటు పొడిచాడంటే ఆచిక్కులోంచి పెరుక్కోలేకచావాలె. అర్జీలు పంపడంతోనే ఆవోవరుసీరుకాడికి పోయి, దణ్ణంపెట్టి చెప్పుకో. తెలిసిందా? తర్వాత నన్ను నిష్ఠూరమాడితే ప్రయోజనంలేదు. చూడు! ఆయన ఊరికేనే చేపడు. ఏదో ఇంతకందెన పడవేసి పురీ లోగట్టుకో పో" అని రెవిన్యూ ఇనస్పెక్టరు సలహా యిచ్చాడు. ఇట్లా చెప్పే వరకు కొండడికి గుండె గుభిల్లుమనింది. కాని ఇంకోదారి కనబడ్డంలేదు.

"సరేలే అయ్యా! నాకళ్ళాటలు నేపడతాలే. నువ్వుమట్టుకు నిండాదయవుంచాలె" అని కొండడు దణ్ణంపెట్టి వెళ్ళి రెండు అర్జీలకూ రెండుపావులాలు ఇచ్చి వ్రాయించి, డిష్ట్రికలెక్టరు కొకటీ, తహశీలుదారు కొకటీ పోస్టులో వేసి ఇంటికివచ్చాడు.

కొండడు వచ్చివెళ్ళిన మరునాడే రెవిన్యూఇనస్పెక్టరు "ఇట్లా ఇట్లా వ్యవహారం జరగబోతోంది. మీ జాగ్రత్తలో మీరుండవలసింది" అని తనజవానుద్వారా లక్ష్మమ్మకు కబురుచేశాడు. లక్ష్మమ్మ స్వయంగావచ్చి మాట్లాడ్డానికి వీల్లేక రామిరెడ్డిని ఇనస్పెక్టరు పంతులుకాడికి పంపుతూ, కూడా పదిఅరటికాయలూ, పది అరటాకులూ ఇచ్చి పంతులుకియ్యమని చెప్పింది. రామిరెడ్డి ఇనస్పెక్టరు పంతులుతో అంతా మాట్లాడి మనస్సుకు తెచ్చుకొని 'ఇంటికిపోయి మాపిన్నమ్మతో మాట్లాడివస్తా'నని కూర్చున్నమనిషి లేచాడు.

"ఇదుగో: ఊరికేనే మంత్రాలకి మామిడికాయలు రాలేకాలం కాదని మీపిన్నమ్మతో గట్టిగా చెప్పు. మాలవాడు ఏవేవో సిఫార్సులు తీసుకొనిపోయి పై ఆఫీసుల్లో గట్టిప్రయత్నం చేస్తున్నాడు. పైగా సర్కారుకు హీనజాతులంటే తగని అభిమానం. ఈ తిరుగుళ్ళన్నీ మీకు తెలియవు. చేసేప్రయత్నం ఘట్టిగా చెయ్యాలని ఆమెతో నొక్కిచెప్పు. తెలిసిందా" అని పంతులనేవరకు 'చిత్తం అట్లాగే లెండి' అని రామిరెడ్డి ఇంటికిపోయి లక్ష్మమ్మతో అన్నిసంగతులూ చెప్పాడు.

"ముందుగా చెయ్యిజారితే తంటాగాని నోరు జారితే పరవాలేదు. ఇచ్చిపుచ్చుకోవడాలు తర్వాత చూచుకోవచ్చుగాని, అసలు మనకు అనుకూలం అయితే కార్యం అంతా అయినతర్వాత ఇనస్పెక్టరుకు ఇరవై రూపాయ లిస్తామని మాటమాత్రం పడేసి చక్కారా" అని లక్ష్మమ్మ చెప్పింది. ఆమాటలే తీసుకువచ్చి రామిరెడ్డి ఇన్స్పెక్టరు కందిచ్చాడు. ఆయన పెదవివిరిచాడు; లాభంలేదనుకొన్నాడు. కొండడు ఇచ్చుకొన్న అర్జీలు

రిపోర్టునిమిత్తంఇనస్పెక్టరువద్దకురాగా ఆయన ఆఖరుకు ఎటూతేల్చకుండా ఎవరికీ అనుకూలం లేకుండా కాలవ ఇస్తే ఇవ్వవచ్చు. ఇవ్వకపోయి నా కొండడికి వచ్చినఇబ్బంది లేదని గోడమీాది పిల్లివాటంగా రిపోర్టువ్రాసి అర్జీలు పైకిపంపి వేశాడు. ఇక పదిహేను, ఇరవైరోజుల్లో తనకు అనుకూలంగా ఉత్తరువులు వస్తవని కొండడు కొండంత ఆశతో ఎదురుతెన్నులు చూస్తు న్నాడు.

(సశేషము)

జ్ఞానపిపాస A. A.